వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 11: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యాకేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే పీజీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల మొదటి, రెండో సంవత్సరం పరీక్షలను వచ్చే నెల 10 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

అనూష (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 11: భర్తతో గొడవ పడిన వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బౌద్ధనగర్ డివిజన్ అంబర్‌నగర్‌లో నివాసముండే బాలరాజు సెంట్రింగ్ పనిచేస్తుంటాడు. అతడికి అనూష (20)తో మూడేళ్ల క్రితం రెండో వివాహం జరిగింది. అప్పటి నుంచి తల్లి, భార్యతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 6న ఉదయం పది గంటల సమయంలో భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బాలరాజును వివాహం చేసుకుని తాను తప్పు చేశానని అనూష బాధపడింది. పదకొండున్నర గంటల సమయంలో టీవీ రిపేర్ చేయించేందుకు బాల్‌రాజు వెళ్లగా దుకాణంలో వారంటీ కార్డు కావాలని చెబితే, వెంటనే భార్యకు ఫోన్ చేశాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో ఇంటికి తిరిగి వచ్చి చూడగా, ఇంటికి తాళం వేసి ఉంది. అనూష ఫోన్ ఇంట్లోనే ఉంది. ఎక్కడికైనా వెళ్లి తిరిగి వస్తుందేమోనని వేచి చూశాడు. అనూష తిరిగి రాకపోవడంతో బంధువులు, సన్నిహితుల దగ్గర వాకబు చేశాడు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అస్తవ్యస్థంగా.. అంతర్గత రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారులు
- కార్పొరేటర్లు ఫిర్యాదు చేసినా... స్పందన కరువు
- వచ్చేది వానకాలం..సమస్యలు లేకుండా చూడాలని స్థానికుల వేడుకోలు

మోండా మార్కెట్‌లోని బండిమ్మెట్ ఏరియాలో మ్యాన్‌హోల్ వద్ద రోడ్డు కుంగి మురికినీరు నిలిచిన దృశ్యం

బేగంపేట్, జూన్ 11: బేగంపేట్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కాలనీలు, బస్తీల్లోని అంతర్గత సీసీ, తారు రోడ్లపై ప్రయాణం చేయాలన్నా..నడవాలన్నా.. ఇబ్బందులు పడాల్సిందే. ఏ రోడ్డు చూసినా గుంతలు,బొందలమయంగా మారాయి. పైపులైన్ల కోసం తవ్విన అనంతరం రోడ్లు వేయకపోవడం లాంటివి కనిపిస్తున్నాయి. మరికొన్ని ప్రదేశాల్లో కుంగిన మ్యాన్‌హోళ్ల వద్ద గుంతలు ఏర్పడి మురికి నీరు నిలిచి రాకపోకలు సాగించలేని విధంగా ఏర్పడ్డాయి. స్థానికులు అధికారులకు రోడ్లు వేయాలని మొర పెట్టుకున్నా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని బస్తీ వాసులు వాపోతున్నారు.

గుంతలమయం రోడ్లు ఎక్కడెక్కడంటే..

బేగంపేట్ సర్కిల్ పరిధిలో రాంగోపాల్‌పేట్, బేగంపేట్, మోండా మార్కెట్, బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో పనులు కొనసాగుతున్నాయి. ఈ డివిజన్‌లలో ప్రధానంగా మోండామార్కెట్ డివిజన్ ప్రధానమైంది. ఇక్కడ నిత్యం వేల సంఖ్యల్లో అంతర్గత రోడ్లపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ కార్పొరేటర్‌గా బీజేపీ పార్టీ నుంచి కొంతం దీపక కొనసాగుతున్నారు.

మోండామార్కెట్‌లోని బండిమ్మెట్, సెకండ్‌బజార్, మారుతి వీధి, మార్కెట్‌రోడ్డు, శివాజీనగర్, శ్రీరామ్ లాడ్జ్ రోడ్డులు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. అలాగే రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో రాణిగంజ్, కళాసీగూడ,ఓల్డ్ బోయిగూడ, బేగంపేట్‌లోని ప్రకాశ్‌నగర్, పాటిగడ్డ, తదితర ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

హైదరాబాద్ రహదారులంటే..అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని పోవడం..దీనికి తోడు గుంతలమయంగా మారిన రోడ్లు..వచ్చేది వానకాలం..వర్షాలు పడ్డప్పుడు ఎక్కడ గుంత ఉంటుందో తెలియని పరిస్థితి..అలాంటి రహదారులపై ప్రయాణం అంటే నరకం అనుభవించక తప్పదు. సనత్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మార్కెట్ రోడ్డులో దెబ్బతిన్న అంతర్గత రోడ్లు

రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

బేగంపేట్ సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్ల పరిధిలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కొన్ని ప్రదేశాల్లో రోడ్లు వేశాం, మరికొన్ని ప్రదేశాల్లో రోడ్ల నిర్మాణానికి వర్క్ ఆర్డర్స్ కూడా ఇచ్చాం. త్వరలోనే రోడ్ల నిర్మాణాలు చేపడతాం.

– సుదర్శన్, జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఈఈ

కార్పొరేటర్లు ఫిర్యాదు చేసినా..

రాంగోపాల్‌పేట్, బేగంపేట్ డివిజన్ల కార్పొరేటర్లు అధికారులకు పలుమార్లు రోడ్ల సంబంధిత సమస్యలు వివరించినా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్నప్పుడు, రోడ్ల నిర్మాణాలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు పాడైన రోడ్లను అంతర్గతంగా ఉన్న వాటిని ప్యాచ్‌వర్కులు, అవసరమైన చోట సీసీ రోడ్డు నిర్మాణాలు చేయించేవారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అధికారుల సమీక్షలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి

జీహెచ్ఎంసీ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 11: వర్షాకాలం ప్రారంభమైనందున జీహెచ్ఎంసీ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి ఆదేశించారు. వర్ష సూచనల కారణంగా రోడ్లపై ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులతో తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తార్నాక డివిజన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. విద్యుత్ తీగలు, వీధి దీపాలను చెట్లు కప్పేయకుండా చూడాలని అన్నారు. రోడ్లపై రాత్రి సమయంలో వెలుగులు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్, ఏఎంసీ హేమలత, ఈఈ ఆశలత, జల మండలి డీజీఎం సరిత, హార్టికల్చర్ వింగ్ మేనేజర్ గణేశ్, ఏఈ వెంకటేశ్, జలమండలి ఏఈలు నిఖిత, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ బోర్ పనులు ప్రారంభం

పవర్ బోర్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్

అడ్డగుట్ట, జూన్ 11 : డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. మంగళవారం ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌లో పవర్ బోర్ పనులను ఆమె ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రాంతాల వారీగా ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, మనోహర్, శ్రీనివాస్ గౌడ్, సత్తయ్య గౌడ్, మహమ్మద్, నర్సింగ్, వసంత, వడ్లూరి రవి, మల్లేష్, శ్రీ రాములు, శ్రీరామ్, భాగ్య పాల్గొన్నారు.

సెమీస్‌లోకి ప్రింట్‌మీడియా టీమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వీ డ్రీమ్స్ బిజ్ టెక్ కార్పొరేట్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో ప్రింట్‌మీడియా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం స్థానిక విజయానంద్ గ్రౌండ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ప్రింట్ మీడియా టీమ్ 39 పరుగుల తేడాతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(ఎస్ఏటీజీ)పై ఘన విజయం సాధించింది.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రింట్ మీడియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. రవికుమార్(36), రోనిత్‌సింగ్(36) మెరుగ్గా రాణించారు. ఫణి కిశోర్(3/27) మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఏస్ఏటీజీ టీమ్ 7 వికెట్లు కోల్పోయి 147 పరుగులకు పరిమితమైంది. ఓపెనర్ కుమార్ బాబు (54) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. మూడు వికెట్లతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన ప్రింట్‌మీడియా ప్లేయర్ రాజశేఖర్(3/18)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. బుధవారం జరిగే సెమీస్‌లో డాక్టర్స్-11 టీమ్‌తో ప్రింట్‌మీడియా తలపడుతుంది.

నేడు అడ్డగుట్టలో 'అమ్మ ఆదర్శ స్కూల్' కార్యక్రమం

సికింద్రాబాద్, జూన్ 11 : నేడు అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్ ప్రభుత్వ స్కూల్‌లో 'అమ్మ ఆదర్శ స్కూల్ 'కార్యక్రమాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు అమ్మ ఆదర్శ స్కూల్ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం 11.30 గంటలకు సీతాఫల్ మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, పజ్జన్న అభిమానులు తరలి రావాలని కోరారు.

కేంద్ర మంత్రులకు శుభాకాంక్షలు :తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా పదవులు స్వీకరించిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను రాంగోపాల్‌పేట్ డివిజన్ బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్ ఢిల్లీలోని వారి నివాసాల్లో కలిసి పూల బొకే, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీర శ్రీకాంత్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరికి కేంద్రంలో మంత్రి పదవులు దక్కడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమన్నారు. – బేగంపేట్ జూన్ 11:

15న కృష్ణమాచార్య శత జయంతి

చిక్కడపల్లి: శ్రీ కళామంజరి, నవ్యనాటిక సమితి ఆధ్వర్యంలో సంగీత సాహిత్యకళా నిధి, గాన కళాపూర్ణ శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్య శతజయంతిని 15న శనివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంస్థల ప్రతినిధులు బండారి రమేశ్, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, ఎం. లక్ష్మీమానస తెలిపారు. మంగళవారం చిక్కడపల్లిలోని నవ్య సాహిత్య సమితి కార్యాలయంలో కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర ఆవిష్కరించారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వతి పరిషత్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమనానికి డాక్టర్ కె.వి. రమణాచారి, పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు హాజరు కానున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

వైష్ణవి (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 11: కళాశాలకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నామాలగుండు ప్రాంతంలోని ఉప్పర్‌బస్తీలో నివాసముండే సి. రాజు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 10న అతడి కూతురు వైష్ణవి (23) కళాశాలకు వెళ్లేందుకు ఉదయం పదకొండు గంటల సమయంలో సోదరుడు నరేందర్‌తో కలిసి వెళ్లింది. నరేందర్ వైష్ణవిని పీజీఆర్ఆర్‌సీడీఈ సమీపంలో విడిచిపెట్టి వెళ్లాడు. తిరిగి తీసుకుచ్చేందుకు మధ్యాహ్నం మూడున్నర గంటలకు అక్కడికి వెళ్లగా వైష్ణవి కనిపించలేదు. స్నేహితులు, కుటుంబ సభ్యులను అడిగినప్పటికీ వైష్ణవి గురించి ఏమీ తెలియరాలేదు. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో తాను మన్నన్‌తో కలిసి వెళ్తున్నట్లు వాట్సాప్ మెసేజ్ పంపింది. దీంతో రాజు ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ మధు బాబు

బొల్లారం,జూన్ 11:ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ మధు బాబు అన్నారు.తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మైనర్లు వాహనాలు నడపడం వలన నాంపల్లి కోర్టు 9మంది బాలురకు 3 రోజులు,మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరు మైనర్లకు సైదాబాద్‌లోని (సామాజిక సేవ)జువైనల్ హోంకు తరలించాలని మంగళవారం తీర్పు వెల్లడించినట్లు తెలిపారు.మైనర్లకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు ఇబ్బందులకు గురికాకూడదని,నిబంధనలు అతిక్రమిస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించేదిలేదన్నారు.

ముగిసిన తలసాని శంకర్ అంత్యక్రియలు

అంతిమ యాత్రలో పాల్గొన్న కేటీఆర్

మారేడ్‌పల్లి, జూన్ 11: మోండా మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. వేలాది మంది అభిమానులు, ఆయా పార్టీల నాయకులు , కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగాయి. వెస్ట్ మారేడ్‌పల్లి రాధిక కాలనీలోని శంకర్ యాదవ్ నివాసం నుంచి ప్రారంభమైన అంతిమ యాత్రలో కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు వేలాది సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

ప్రముఖుల నివాళి

మారేడ్‌పల్లి రాధికా కాలనీలోని నివాసంలో తలసాని శంకర్ యాదవ్ పార్థివ దేహానికి పలువురు నివాళులర్పించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేక్, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి. హన్మంతరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు శంకర్ యాదవ్ పార్థివ దేహానికి నివాళులర్పించారు.


రాధిక కాలనీలో శంకర్ యాదవ్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

శంకర్ యాదవ్ అంతిమ యాత్రలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ డిప్యూటీ స్పీకర్ టి. పద్మారావు గౌడ్, తదితరులు

అంతిమ యాత్రలో పాల్గొన్న అభిమానులు

అంతిమ యాత్రలో పాల్గొన్న కేటీఆర్..

తలసాని శంకర్ యాదవ్ అంతిమ యాత్రలో పలువురు ప్రముఖులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బన్సీలాల్‌పేట గ్రేవ్ యార్డు వరకు సాగిన అంతిమయాత్రలో పాల్గొని, శంకర్ యాదవ్ పార్థివ దేహానికి నివాళులర్పించి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించారు. అంతిమయాత్రలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే టి.పద్మారావు గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు ఎర్రోళ్ల శ్రీనివాస్, అనిల్ కుమార్ కూర్మాచలం, చిరుమళ్ల రాకేశ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, రోహన్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

గాంధీలో ఎంపీ బలరామ్‌కు వైద్య పరీక్షలు

గాంధీ దవాఖానలో వైద్య పరీక్షలు చేయించుకున్న ఎంపీ బలరామ్ నాయక్

బన్సీలాల్‌పేట్, జూన్ 11 : మహబూబాబాద్ ఎంపీ బలరామ్ నాయక్‌కు మంగళవారం సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖాన వైద్యులు వ్యక్తిగత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ హెల్త్ చెకప్‌లో భాగంగా కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, యురాలజీ, రేడియాలజీ విభాగాలలో ఆయనకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం హెచ్ఓడీ, ప్రొఫెసర్ పి.శ్రావణ్‌కుమార్‌లు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ బలరామ్ నాయక్ మాట్లాడుతూ తాను గతంలో కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో కూడా జనరల్ హెల్త్ చెకప్ కోసం గాంధీ దవాఖానకు వచ్చానని గుర్తు చేసుకున్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న గాంధీ దవాఖానలో వైద్య చికిత్స చాలా బాగున్నదని ఆయన వైద్యులు, సిబ్బందిని ప్రశంసించారు. అనంతరం గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు దవాఖానలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీకి వివరించారు. దవాఖాన డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీహరీ, అనస్థీషియా విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీదేవిలు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం: రోడ్లపైనే చెత్త..పోయేదెట్ల అంటున్నారు స్థానిక ప్రజలు. ఇదేదో మారుమూల ప్రాంతంలో అనుకుంటే పొరపాటే.. సికింద్రాబాద్ రాంగోపాల్ పేట డివిజన్ నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాల ఎదురుగా రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించకపోవడంతో అటు నుంచి పోయేవారు ఇబ్బందులు పడుతున్నారు.

చెత్తతో స్వాగతం: నేటి నుంచి బడులు ప్రారంభం కానున్నాయి. అయితే సికింద్రాబాద్ స్టేషన్‌రోడ్డులోని ఎస్పీజీ పాఠశాల వద్ద చెట్ల కొమ్మలను నరికి స్కూల్ గేట్ పక్కనే వేసి ఇప్పటికీ తొలగించలేదు. ఈ విధంగా ఉంటే బడులకే విద్యార్థులు వచ్చేది ఎట్ల అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.